క్లుప్తంగా

శ్రీరామ జన్మభూమి మందిరం స్టాంపుల ఆవిష్కరణ



శ్రీరామ జన్మభూమి మందిర స్మారక తపాలా స్టాంపులను ఆవిష్కరిస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్): శ్రీరామ జన్మభూమి మందిరం స్మారక తపాలా స్టాంపులను శుక్రవారం నగర మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవ్‌తేజ ఆవిష్కరించారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో మేయర్, కమిషనర్‌లను వారి చాంబర్‌లలో తపాలాశాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. తపాలశాఖకు చెందిన ఆధార్, పాస్‌పోర్టు సేవలు, జీవిత బీమా, ప్రమాద బీమా తదితర పథకాల గురించి వారితో చర్చించారు. కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సీనియర్ మేనేజర్ ఎం. అజీజుద్దీన్, కర్నూలు ప్రాంతీయ పోస్ట్ ఆఫీసు సూపరింటెండెంట్ జనార్ధన్ రెడ్డి, పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్ట్రక్టర్ మాదన్న పాల్గొన్నారు.

డీఈఈలకు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): ఇటీవల నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న డీఈఈ గోపాల్‌కృష్ణను ప్రభుత్వం సరెండర్ చేసింది. దీంతో ఆయన పర్యవేక్షణ చేస్తున్న విధులను నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఇరువురు డీఈఈలకు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 10, 11 వార్డులు, అలాగే 30 నుంచి 32 వార్డులకు సంబంధించిన అభివృద్ధి పనులను డీఈఈ డీవీ కృష్ణలతకు, 26 నుంచి 29 వార్డుల్లోని పనుల పర్యవేక్షణను డీఈ సి.నరేష్‌కు కేటాయించారు.

లక్ష్మీనగర్‌లో సమస్యలు పరిష్కరించాలి



సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 24వ వార్డు పరిధిలో ఉన్న లక్ష్మీనగర్‌లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం 24వ వార్డు కార్యదర్శి కేవీ జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇంటింటా సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..లక్ష్మీనగర్ చివరి వరకు పైపులైన్ వేయాలని, రోడ్డు వేయాలని కోరారు. సుద్దవాగును విస్తరించి రక్షణ గోడ కట్టించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. అజ్మత్, ఆర్.వెంకటేశ్వర్లు, పెద్దసూరి, నాగజమ్ములు, పవన్, చందు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని పాతబస్తీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం బృందం పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంది. పాఠశాలలో 8 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల పక్కన ఉన్న పార్కులో ఆకతాయిల ఆగడాలను అడ్డుకునేందుకు పోలీసులు రంగప్రవేశం చేయాలన్నారు.కార్యక్రమంలో నాయకులు ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, మహబూబ్‌బాషా, ఇస్మాయిల్, ముసామియా పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి

కర్నూలు(అగ్రికల్చర్): నెల రోజుల వ్యవధిలోనే మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని జిల్లా మహిళ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ముచ్చుమర్రి గ్రామంలో అభం, శుభం తెలియని బాలికను రేప్ చేసి హత్యచేయడం దారుణమన్నారు. సభ్యసమాజం తలదించుకోవాల్సిన సంఘటనగా అభివర్ణించారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, వ్యవస్థాపకురాలు జ్ఞానేశ్వరమ్మ, గౌరవ అధ్యక్షురాలు మాధవీ శ్యామల, సెక్రటరీ విజయ విలేకర్లలో మాట్లాడారు... నెల రోజుల వ్యవధిలోనే మహిళలపై అఘాయిత్యాలు, దౌర్జన్యకాండ వంటి ఘటనలు 8 వరకు జరిగాయని పేర్కొన్నారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన మైనర్ యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వేగంగా రోడ్డు విస్తరణ

కల్లూరు: బస్తిపాడు నుంచి చిన్నటేకూరు ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఓర్వకల్లు మండలం నన్నూరు నుంచి తడకనపల్లె, చిన్నటేకూరు, బస్తిపాడు మీదుగా కె.నాగలాపురం ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును విస్తరించాలని ఆయా గ్రామాల ప్రజల నుంచి వినతుల మేరకు గత ప్రభుత్వం హయాంలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. కొద్ది రోజులుగా బస్తిపాడు నుంచి చిన్నటేకూరు రోడ్డుకు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి.



సప్తగిరినగర్ చౌడేశ్వరీ ఆలయంలో శాకాంబరీగా అమ్మవారు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు



నిమిషాంబ దేవి ఆలయంలో సామూహిక పూజల్లో భక్తులు

శాకాంబరీ నమోస్తుతే

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని ఓల్డ్‌సిటీలోని నిమిషాంబ దేవి ఆలయంలో అమ్మవారికి అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. అభిషేకం, వస్త్ర సమర్పణ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మ వారిని అన్ని రకాల కూరగాయలతో శాకాంబరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం ఆషాఢ మాసం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చౌడేశ్వరీ దేవిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ మాతగా అలంకరించి దర్శనం కల్పించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

- వచ్చే నెల 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం
- వీహెచ్ఎస్ఎన్‌సీ తనిఖీలో డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, పిల్లలకు అందించే పోషకాహారంపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం గార్గేయపురం గ్రామంలో జరుగుతున్న గ్రామీణ ఆరోగ్య పారిశుద్ధ్య పోషకాహార కమిటీ(వీహెచ్ఎస్ఎన్‌సీ) మీటింగ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెండో శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లో అన్ని వీహెచ్ఎస్ఎన్‌సీ కమిటీల్లో మీటింగ్ నిర్వహించాలన్నారు. కమిటీలోని సభ్యులైన సర్పంచ్, స్కూల్ టీచర్, పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది, స్కూల్ టీచర్, ఇంజినీర్, గర్భిణులు, బాలింతలు, స్వయం సహాయక సిబ్బంది, గ్రామ ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఉంటారన్నారు. ఈ కమిటీ సభ్యులు ఆ సమావేశంలో ఆరోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆ నెలలో చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చిస్తారన్నారు. ఆరోగ్య కార్యక్రమాలను ప్రణాళిక వేసి అమలు పరచాలన్నారు. ప్రభుత్వం ఒక్కో వీహెచ్ఎన్ఎస్‌సీ కమిటీకి సంవత్సరానికి రూ.10వేల చొప్పున బడ్జెట్ ఇస్తుందన్నారు. ఆ బడ్జెట్‌ను ఆ గ్రామాభివృద్ధికి ఉపయోగించాలన్నారు. వచ్చే నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో గృహ సందర్శనాలు చేసి వారికి డయేరియా వ్యాధిపై అవగాహన కల్పించి, ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులకు తల్లిపాల ప్రాముఖ్యత, చేతుల పరిశుభ్రత, ఓఆర్ఎస్ ప్యాకెట్ల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి, సర్పంచ్ సోమేశ్వరమ్మ, డీసీఎం ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, పంచాయతీ సెక్రటరి పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

కల్లూరు: పందిపాడు పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు గృహ నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ నగర కార్యదర్శి రాముడు, కార్యదర్శి వర్గ సభ్యులు సాయిబాబా, సుధాకరప్ప, ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం పందిపాడు పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2009లో అప్పటి ప్రభుత్వం కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఇళ్లు లేని 2500 మంది పేదలకు ఇంటి స్థలాలు కేటాయించిందన్నారు. తర్వాత వచ్చిన పాలకులు కాలనీలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించలేదన్నారు. రహదారులు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసిన కాలనీలో కుంటలను తలపించేలా నీరు నిలిచిపోతుందన్నారు. అలాగే కాలనీలో ఓపెన్ స్థలాలు కాపాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహమ్మద్‌రఫీ, హుస్సేన్ బాషా, భాస్కర్, మనోహర్, శ్రీనివాసులు గోవిందు, రాము, విజయ్ కుమార్, నగేష్, బాలు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీ

- తల్లి మృతి.. బిడ్డకు తీవ్ర గాయాలు



మృతిచెందిన సోమేశ్వరి

కర్నూలు (అగ్రికల్చర్): స్థానిక నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని బళ్లారి చౌరస్తా సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొన్న ఘటనలో తల్లి మృతిచెందగా బిడ్డకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో ఈ ఘటన జరిగింది.వివరాల్లోకి వెళితే.. నగరంలోని నాగేంద్రనగర్‌కు చెందిన సోమేశ్వరి (65)తన కుమార్తె ప్రశాంతితో కలిసి చౌరస్తా సమీపంలోని రాజీవ్‌నగర్ యమహ షోరూం వద్ద చిన్న బంకు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే రాత్రి దుకాణం బంద్ చేసి తల్లీకుమార్తె నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. కర్నూలు–బళ్లారి రోడ్డు దాడుతుండగా కోడుమూరు నుంచి కర్నూలు వైపు గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో సోమేశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా, ప్రశాంతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రురాలును చికిత్స నిమిత్త కర్నూలు పెద్దాసుపత్రికి తరలించారు. మహిళ మరణానికి కారణమైన కారును వెంటనే పట్టుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తూ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

కూటమికి అధికారం కక్ష సాధింపులకేనా?

కర్నూలు: రాష్ట్ర ప్రజలు కూటమికి అధికారం ఇచ్చింది కక్ష సాధింపు చర్యలకేనా అని అంబేడ్కర్స్ ఇండియా మిషన్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ గంగుమాల శోభన్ బాబు ప్రశ్నించారు. దళిత అధికారి, సీఐడీ మాజీ డీజీ పి.వి.సునీల్ కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. గత ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ సునీల్‌కుమార్‌కు పోస్టింగ్ ఇవ్వకుండా అవమానించడమే కాకుండా ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు ఫిర్యాదుపై స్పందించి పోలీసులు కేసు నమోదు చేయడం ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యగా దళితులు భావిస్తున్నారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తిరస్కరించిన కేసులో ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. దళిత అధికారి పట్ల ఎన్‌డీఏ ప్రభుత్వం తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

గుండమ్మను చంపిన వారిని అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆదోని మండలం నాగనాథహళ్లికి చెందిన బసివిని, దళిత మహిళ అయిన గుండమ్మను పొలం వివాదంలో ట్రాక్టర్‌తో గుద్ది చంపిన శ్రీధరెడ్డి, సోమప్ప, సుబ్బారెడ్డి, నాగరాజు, లక్ష్మన్నలను వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం గుండమ్మ హత్యను ఖండిస్తూ పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాగనాథహళ్లిలో జరిగిన హత్య కుల దురహంకారానికి నిదర్శనమన్నారు. గ్రామానికి చెందిన రాగప్ప కుమార్తె భూమిని దళితురాలు అయిన గుండమ్మ కొనుగోలు చేయడంతో ఆమె అన్న శ్రీధర్‌రెడ్డి ఓర్వలేక పోయారన్నారు. దళితులు భూములు కొనుగోలు చేసిసాగు చేసుకోవడం తప్పా అని ప్రశ్నించారు. గుండమ్మను చంపడంతో పాటు అండగా నిలబడిన పురుషోత్తంరెడ్డిని కర్రలతో రక్త గాయాలయ్యేలా చితకబాదారన్నారు. ఈఘటనపై పోలీసులు, కలెక్టర్ స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గురుస్వామి, ఆర్. నరసింహులు,ఎస్‌జీ కృష్ణ, ఎస్.చక్రపాణి, మెర్సీ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అగ్రకుల ఆధిపత్యాన్ని అణచివేయాలి

ఆదోని మండలం నాగనాథహళ్లికి చెందిన దళితమహిళ గుండమ్మను పొలం తగాదాలో ట్రాక్టర్ గుద్ది చంపడం అగ్రకుల ఆధిపత్యానికి నిదర్శనమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండూరి లాజరస్ అన్నారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ..గుండమ్మను హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి 5 ఎకరాల పొలం, రూ.50 లక్షలు, ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేషన కమిటీ చైర్మన్ అనంతరత్నం, నాయకులు సయ్యద్ నవీద్, బి.సుబ్రమణ్యం,అబ్దుల్‌హూ, సత్యరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమాచారం

నేడు నగరంలో కరెంట్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ లైన్‌లు, సబ్ స్టేషన్ల మెయిన్‌టెనెన్స్ పనులు శనివారం చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈలు రాజేంద్రబాబు, నాగప్రసాద్ తెలిపారు. క్యాంపస్ సెక్షన్ పరిధిలోని మద్దూర్‌నగర్, సి.క్యాంపు, గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, సాయి వైభవ్ నగర్, చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రినగర్, బృందావన్ నగర్, మారుతినగర్, అరుంధతినగర్ పరిసరాలు, శ్రీరామ్ నగర్, మారుతి మెగాసిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మినగర్, కమలానగర్, టెలికామ్‌నగర్, గఫార్‌నగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, కిసాన్‌నగర్, శ్రీనగర్ కాలనీ, మాధవనగర్, సీ,బీ క్యాంపులు, గాయత్రీ ఎస్టేటు, లక్ష్మీనగర్‌తో పాటు ఎస్టేటు ఏరియా సెక్షన్, ఓల్డ్ టౌన్ సెక్షన్ పరిధిలోని కాలనీలు, వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, పాతబస్టాండు ఏరియా, ఎస్ఏపీ క్యాంపు, చౌరస్తా ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని సూచించారు.

అవీ-ఇవీ

నేడు కళాకారులకు సన్మానం

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మద్దూరునగర్ పింగళి సూరన తెలుగు తోటలో పలు అవార్డుల గ్రహీతలైన కళాకారులు హనుమంతరావు, బైలుప్పల షఫీయుల్లా, డాక్టర్ అరుణకుమారిని సన్మానించనున్నట్లు సంఘం అధ్యక్షుడు గుర్రపు శాల అంకయ్య పేర్కొన్నారు.

వలసలు ఆపండి

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి హామీపథకం కింద అన్ని గ్రామాల్లో పనులు కల్పించి వలసలు నిరోధించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు జిల్లా నీటి నీటి యాజమాన్య సంస్థ అధికారులను కోరారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఉపాధి సిబ్బంది ఎంపీని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. భూగర్భ జలాలు, జలసంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా అధికారులకు సూచించారు. ప్రస్తుతం పండ్లతోటల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ ఏడాది దాదాపు 7,470 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా తీసుకున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు (టౌన్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. శుక్రవారం డ్రైడేను పురస్కరించుకొని నగరపాలక మలేరియా విభాగం అధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని, వ్యర్థాలను తొలగించారు. దోమల వ్యాప్తి అరికట్టేందుకు పిచికారీ చేశారు. స్థానిక ప్రజలకు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో హైపో క్లోరేట్ పిచికారీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే కెసీ కెనాల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు, శానిటేషన్ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహమ్మద్ ఇస్మాయిల్ (52)చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. పాతబస్తీకి చెందిన ఈయన గౌండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అదే కాలనీకి చెందిన మహబూబ్ బాషాతో కలిసి ఇ.తాండ్రపాడులో గౌండ పని ముగించుకుని గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తూ తుంగభద్రనది బ్రిడ్జిపై ప్రమాదానికి గురయ్యాడు. మహబూబ్ బాషా వాహనం తోలుతుండగా మహమ్మద్ ఇస్మాయిల్ వెనుక కూర్చున్నాడు. పంచలింగాల వైపు నుంచి కర్నూలుకు వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొనడంతో ఇరువురూ కింద పడ్డారు. మహమ్మద్ ఇస్మాయిల్‌కు తలకు బలమైన గాయమైంది. అదే ఆటోలోనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక అదేరోజు అర్ధరాత్రి మృతిచెందాడు. ఈయనకు భార్య శంషాద్, ఒక కొడుకు, కూతురు సంతానం. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు ఆటోడ్రైవర్ అన్వర్‌ను అదుపులోకి తీసుకుని భార్య శంషాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కాలేజీ వద్ద రోడ్డు విస్తరణకు లైన్ క్లియర్

కర్నూలు (టౌన్): నగరంలో బుధవార పేట మెడికల్ కళాశాల గేటు వద్ద రహదారి విస్తరణ పనులకు లైన్ క్లియర్ అయింది. ఇక్కడ రహదారి మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగులు ఉండాలి. అయితే మెడికల్ కళాశాల గేటు వద్ద 209 సర్వే నెంబర్‌లో 100 అడుగులు మాత్రమే రోడ్డు ఉంది. ముందు షాపులు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ సమీక్ష సమావేశంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న దుకాణదారులతో మాట్లాడారు. మలుపు ఇబ్బందులు తొలగలంటే 7 షాపులు తొలగించాల్సి ఉంటుందన్నారు. విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయం మార్గాలు చూపి న్యాయం చేయాలని కమిషనర్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి, ఏసీపీ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ మంజులబాయి, డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్

కర్నూలు(హాస్పిటల్): మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణం పరిరక్షించబడుతుందని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం వద్ద ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెరగడం వల్ల క్యాంపస్‌లో పచ్చదనం సంతరించుకుంటుందని, వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని చెప్పారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డే సందర్భంగా 50 మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఆసుపత్రి ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడాలంటే మరిన్ని మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ మంజులబాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌చంద్రమౌళి, క్యాన్సర్ హెచ్ఓడీ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను కాపాడటంలో ప్రథమ చికిత్స ప్రధానం



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అశోక్

కర్నూలు(హాస్పిటల్): రోగులను కాపాడటంలో ప్రథమ చికిత్స ఎంతో ప్రధానమని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ అన్నారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో పారామెడికల్ విద్యార్థులకు బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీలోని ఈసీజీ, కార్డియాలజీ, క్యాథలాబ్, అనస్తీషియా టెక్నీషియన్‌లతో శిక్షణ కార్యక్రమం ద్వారా రోగులకు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు అడ్వాన్స్‌డ్ లైఫ్ సేవింగ్ ప్రొసీజర్ చాలా ముఖ్యమైందన్నారు. ఇది ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించాలన్నారు. రోగి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు వారికి ఏ విధంగా కాపాడాలనే దానిపై విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలో శని, ఆదివారాల్లో పోస్టుగాడ్యుయేషన్ విద్యార్థులతో అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం విజయవాడకు చెందిన డాక్టర్ అశోక్‌తో బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలత, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న నగర మేయర్ రామయ్య

కర్నూలు (టౌన్) : ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని నగర మేయర్ బీవై రామయ్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సంయుక్తంగా వెల్లడించారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అర్హత సాధించిన ఇరువురికి మేయర్, కమిషనర్ వారి చాంబర్లలో నియామక పత్రాలు అందజేశారు. నగరపాలకలో పనిచేస్తూ వివిధ కారణలతో మృతి చెందిన బి. శ్రీనివాసులు, బి.అయన్న స్థానాల్లో వారి కుమారులు బి. అమర్నాథ్, బి. శ్యాంబాబుకు సబార్డినేట్‌లుగా నియమించారు. కార్యక్రమంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు, సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స



రోగితో డాక్టర్ భార్గవ వ్యాస్, మహేశ్వరరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటుతో పాటు చిన్న పేగులోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టిన (మెసెంటెరిక్ ఎంబోలిజం) కొండారెడ్డి అనే వ్యక్తికి చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ జనరల్, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ భార్గవ వ్యాస్ ఏయాన్ చెప్పారు. శుక్రవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సారావు పేటకు చెందిన కొండారెడ్డి వాంతులతో పాటు కడుపునొప్పితో బాధ పడుతున్నాడన్నారు. ఇతనికి గతంలో గుండెపోటు రావడంతో గుండెలో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. ఈ సమస్యలతో ఆయన తమ హాస్పిటల్‌కు రాగా పాడైన పేగు భాగాన్ని విజయవంతంగా తొలగించి, పేగు ఆరోగ్యకర భాగాలను తిరిగి అనుసంధించినట్లు తెలిపారు. ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి అభినందించారు.

ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి



డీఆర్వో కె.మధుసూదనరావుకు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. సరైన వసతులు లేకుండా కోచింగ్ సెంటర్లను నడుపుతున్నారన్నారు. ఏదైనా అనుకొని ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలాంటి రక్షణ లేదన్నారు. కర్నూలు నగరంలో 14 ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు ఉన్నాయని, వాటిలో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు హుస్సేన్ బాష, ప్రకాష్, అబ్దుల్లా, వెంకటేష్ పాల్గొన్నారు.